క్లుప్తంగా

అమ్మవారికి వెండి హారం విరాళం



కొలనుభారతిదేవి అమ్మవారికి వెండి హారాన్ని ఇస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతిదేవి అమ్మ వారికి భక్తులు వెండి హారాన్ని గురువారం విరాళమిచ్చారు. నందికొట్కూరు పట్టణానికి చెందిన ఎద్దుల సంజీవ రెడ్డి, మహేశ్వరమ్మల దంపతులు 7.5 తులాల వెండి హారాన్ని అమ్మ వారికి కానుకగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మకు అందించారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న సలీం

పాములపాడు: స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాల, కళాశాలను రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ సలీం గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులతోపాటు విద్యార్థులకు పంపిణీ చేసిన పుస్తకాలు, యూనిఫామ్, హోం వర్క్, పరీక్షా పత్రాలు పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. చదువును నిర్లక్ష్యం చేయవద్దని, భవిష్యత్తు మంచిగా ఉండాలంటే క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు.

పంటల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామ పరిధిలో వర్షాల వల్ల దెబ్బతిన్న పైర్లను వ్యవసాయ శాస్త్రవేత్తలు అశోక్, నసిరుద్దీన్, పుల్లిబాయి గురువారం పరిశీలించారు. దెబ్బతిన్న పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వరదరాజస్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, వర్షాలకు భవనాశి, సుద్దవాగుల, ఒద్దులంక వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పొలాల్లోకి నీరు చేరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని సర్పంచు కోట్ల చంద్రారెడ్డి శాస్త్రవేత్తలకు వివరించారు. నివేదికలు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపుతామని శాస్త్రవేత్తలు తెలిపారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి ఉన్నారు.

దత్తాత్రేయస్వామికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి లోకకల్యాణం కోసం గురువారం దేవస్థానం అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

అలరించిన భక్తి రంజని



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన సూర్య కళా కల్చరల్ అకాడమీ వారి భక్తిరంజని కార్యక్రమం అలరించింది. గణపతి ప్రార్థన, గణనాథం భజే, శంభో మహాదేవ, భో శంభో, నమశ్శివాయతే, శివ శివ శంకరా, నటరాజస్వామి, పలు శివకీర్తనలను గీతాంజలి, శివరేవంత్‌రెడ్డి, గీతాశ్రీ, హర్ష, జయ. జయంత్ తదితరులు ఆలపించారు. కార్యక్రమానికి మృదంగ సహకారాన్ని సుధాకర్, వయోలిన్ సహకారాన్ని బి.రమణయ్య, ఘటం సహకారాన్ని చరణ్ అందించారు.

ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష వద్దు

వెలుగోడు: ఎయిడ్స్ రోగులపట్ల వివక్ష చూపకుండా వారికి మానసిక ధైర్యాన్ని ఇవ్వాలని మేరిబా సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ జుల్ఫికర్ అలీ ఖాన్ సూచించారు. వేల్పనూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఆయన విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రమణయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కారుపై అంగన్‌వాడీల కన్నెర్ర

- పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్
- యాప్‌ల భారం తగ్గించాలని విన్నపం
- ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలని వినతులు

కూటమి సర్కారుపై అంగన్‌వాడీలు కన్నెర్ర చేశారు. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని, యాప్‌ల భారం తగ్గించాలని నినదించారు. చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తున్న తమకు ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి



సీడీపీఓ కోటేశ్వరమ్మకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఆత్మకూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు పనికి తగిన వేతనం ఇవ్వాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షులు, కార్యదర్శులు సద్దాం, రామ్‌నాయక్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు లక్ష్మీదేవి, మంజుల డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలన్నారు. యాప్‌ల భారం తగ్గించాలన్నారు. సంఘం నాయకురాళ్లు ప్రమీలమ్మ, రణధీర్, అరుణ, వాణి, సుజాత, కుమార్‌బాయి, మహేశ్వరి, వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

- బండిఆత్మకూరు: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్లు గురువారం బస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.
- వెలుగోడు: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ - హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకురాళ్లు తులసమ్మ, రమణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, గ్రాట్యూటీ జీఓలో మార్పులు చేయాలని కోరారు.



జూపాడుబంగ్లాలోని కేజీ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు భాగ్యలక్ష్మి, కుమారి, అనిత, దర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- జూపాడుబంగ్లా: తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని నమ్మబలికిన కూటమి నేతలు ప్రస్తుతం మోసం చేస్తున్నారని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ లీడర్లు వెంకటరమణమ్మ, ప్రసన్నలక్ష్మి, జయమ్మ, రామతులసి, సీపీఎం మండల కన్వీనర్ కర్ణ విమర్శించారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కర్నూలు-గుంటూరు రహదారిపై అంగన్‌వాడీ వర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు రాము పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్

పగిడ్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ మండల అధ్యక్షురాలు ఖుర్షీద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలతో గొడ్డు చాకిరి చేయించుకుంటూ వేతనాలు పెంచకపోవడం తగదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లు పని చేయడం లేదని, పోషణ ట్రాకర్, బాలసంజీవిని యాప్‌లకు సపోర్ట్ చేయడం లేదని, మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలతో సతమతమవుతున్నామని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ శివరాముడుకు అందజేశారు. సంఘం నాయకులు వరలక్ష్మి, షాజదాబేగం, సునీత, రమణమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

నందికొట్కూరు: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ కోరారు. గురువారం రెవెన్యూ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లపై పనిభారం పెంచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు మాత్రం పెంచకపోవడం తగదన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో అంగన్‌వాడీ యూనియన నాయకురాళ్లు మదర్‌బీ, శైలజ, లక్ష్మి, పద్మావతి, కీర్తి, చాంద్‌బీ, కమల్‌బీ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల భారం తొలగించాలి



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కొత్తపల్లి: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి, యాప్‌ల భారం తొలగించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకురాలు ఈ.హరిత, మండల నాయకురాలు నాగమణి, శ్రీదేవి డిమాండ్ చేశారు. గురువారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వసంత, లక్ష్మీదేవి, నాగమణి, వెంకటలక్ష్మి, లత, జయమ్మ, మైమున్నిసా, పార్వతి, సుభాషిణి, రమాదేవి, పద్మావతి, ప్రభావతి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



ధర్నాచేస్తున్న అంగన్‌వాడీలు

పాములపాడు: అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు పెంచాలని అంగన్‌వాడి వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి శివలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014 నుంచి ఇప్పటి వరకు అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోవడంతో జీవనం గడవడం కష్టమైందన్నారు. అనంతరం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు రమాబాయి, నాగమణి, నగమద్దమ్మ, సువర్ణ, రమాదేవి పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలి



డీఎఫ్‌ఓ సాయిబాబాకు వినతి పత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో అడవి పందుల వల్ల పంటలు భారీగా దెబ్బతిన్నాయని, ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. గురువారం వారు డీఎఫ్‌ఓ సాయిబాబాను కలిసి వినతి పత్రం అందించారు. వందల ఎకరాల్లోని పంటలను అడవి పందులు ధ్వంసం చేశాయని వివరించారు. గతంలో మాదిరి నామమాత్రపు పరిహారం కాకుండా ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. డీఎఫ్‌ఓను కలిసిన వారిలో సంఘం నాయకులు మాబాషా, గంగన్న, రామకృష్ణ, వెంగన్న, ఆత్మకూరు, కొత్తపల్లి రైతులు ఉన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆత్మకూరు: పట్టణాభివృద్ధే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కో ఆప్షన్ సభ్యులు రషీద్ తెలిపారు. గురువారం పట్టణంలోని సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయం, పాత బస్టాండు, మెయిన్‌బజార్, పటాన్‌చోడా, తోటగేరి మీదుగా కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి కొత్తపేట మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు రూ.4.25 కోట్లతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



జీపు జాతాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురాం మూర్తి

పగిడ్యాల: ఎన్నికల హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురాం మూర్తి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) చేపట్టిన జీపుజాతా గురువారం పగిడ్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్‌కు పెద్దపీట వేసి ప్రజలపై పన్నుల భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో నిర్వస్తున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు భారీగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రహదారిపై వరినాట్లు



ప్రధాన రహదారిపై వరినాట్లు వేస్తున్న నాయకులు

నందికొట్కూరు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దత్తత గ్రామం కొణిదేల గ్రామంలోని ప్రధాన రహదారి బురదమయంగా ఉండటంతో గురువారం సీపీఎం నాయకులు, ప్రజలు వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దత్తత గ్రామంలోనే ఈ విధంగా ఉంటే మిగతా గ్రామాల పరిస్థితి ఏమిటన్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లు చిత్తడిగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. ఈ దారిలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగన్న, లక్ష్మన్న, నాగేంద్ర, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, శేషన్న, మద్దిలేటి, హనుమంతు, మౌలాలి, గౌడ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐను నియమించేదెప్పుడో?



ఎస్‌ఐ నియామకానికి నోచుకోని జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్

జూపాడుబంగ్లా: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ లేకపోవటంతో మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి ఎస్‌ఐ లక్ష్మినారాయణ ఆరు రోజుల క్రితం అకస్మాత్తుగా బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో ఎవ్వరినీ నియమించకపోవటంతో వివిధ గ్రామాల ప్రజలు సమస్యలను విన్నవించేందుకు వచ్చి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఈనెల 27న వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే వారు, ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేసేవారు కరువయ్యారు. పోలీసుస్టేషన్‌లో బాధితుల ఫిర్యాదులపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేసే విషయమై స్టేషన్ సిబ్బంది కూడా తర్జనభర్జన పడుతున్నారు. కొందరు బాధితులు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న నందికొట్కూరురూరల్ సీఐని ఆశ్రయిస్తుండగా మిగతా వారు మిన్నకుండిపోతున్నారు. జిల్లా ఎస్పీ స్పందించి స్టేషన్‌కు ఎస్‌ఐను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోండి



ప్రసంగిస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరురూరల్: వినాయక చవితి పర్వదినాన్ని ఆహ్లాదంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా హిందూ, ముస్లిం మతాల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన విధివిధానాలను ఆయన వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాలు ముగిసేవరకు మండపాల నిర్వాహకులదే బాధ్యత అని అన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ నాగజ్యోతి, మున్సిపల్ కమిషనర్ రమేష్, తహసీల్దార్ రత్నరాధిక, సీఐలు సురేష్‌కుమార్ రెడ్డి, రాము, మోహన్ రెడ్డి, ఎస్‌ఐ నారాయణ రెడ్డి, ప్రొబేషనరీ ఎస్‌ఐ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో కులమతాలకు అతీతంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీసు శాఖ ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గణేష్ నిమజ్జనం చేసే తేదీలు, సమయం, ఏ వాహనంలో విగ్రహాన్ని తీసుకెళ్తారో వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ తిరుపాలు పాల్గొన్నారు.

కమిటీ వారే బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి

పాములపాడు: వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా ఉత్సవ కమిటీ వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో అన్ని మతాల వారితో సమావేశం నిర్వహించారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకుని, యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మండపాల వద్ద జాగ్రత్తగా వ్యవహరించుకోవాలని వివరించారు. సమావేశంలో ఎస్‌ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

462 క్యూసెక్కుల నీటి విడుదల

పాములపాడు: మండలంలోని శాంతినిలయం గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటరు లాకీన్స్‌లా నుంచి గురువారం 462 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. సుంకేసుల నుంచి 2,500 క్యూసెక్కుల నీటిని విడదలు చేశారని, శుక్రవారం ఉదయానికి లాకీన్స్‌లాను చేరుతుందని చెప్పారు. కాగా ప్రస్తుతం లాకీన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 62 క్యూసెక్కులు, తూడిచెర్ల ఎస్కేప్ చానల్(కేసీసీ)కు 400 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల కొనసాగుతుందన్నారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గేట్లు బంద్ చేసినట్లు తెలిపారు.

నేడు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి అమ్మవారికి శుక్రవారం వివిధ రకాల ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి గురువారం పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బి.రామారావు రూ.1,11,116 విరాళాన్ని పర్యవేక్షకులు రవికుమార్‌కు అందజేశారు. దాతకు రశీదు, లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

101 పింఛన్లు తొలగింపు

వెలుగోడు: మండలంలో 101 మంది పింఛన్లు తొలగించినట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టి ఇందులో అనర్హులుగా గుర్తించిన వారికి సెప్టెంబర్ నుంచి పింఛన్లు రద్దు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 6,413 ఉండగా అనర్హత కారణంగా 101 పింఛన్లు రద్దు చేశామన్నారు. అభ్యంతరాలుంటే ఆధారాలతో అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు.

జూపాడుబంగ్లా మండలంలో..

జూపాడుబంగ్లా: మండల వ్యాప్తంగా 87 మంది పింఛన్లు తొలగించినట్లు అధికారులు నోటీసులు జారీ చేశారు. మొత్తం 4,951 పింఛన్లు ఉండగా 453 మందిని రీవెరిఫికేసన్ చేసి అందులో వికలత్వ శాతం తక్కువ ఉందంటూ 87 మంది పింఛన్లు నిలిపివేస్తున్నట్లు నోటీసులు జారీచేశారు. మరో 24 మందికి వస్తున్న రూ.10 వేలు, రూ.6 వేల పింఛన్ నుంచి రూ.4వేల పింఛన్‌కు కన్వర్షన్ చేస్తూ నోటీసులు జారీ చేశారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామానికి చెందిన పగిడిమాను రాజు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. దీనికి తోడు పేద కుటుంబం కావడంతో పూట గడవని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎం లింగాపురం గ్రామానికి చెందిన చిమ్మె అక్కిరాజు సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో రాజు కుటుంబానికి గురువారం రూ.15,016 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సమతా సైనిక దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు సగినెల సురేష్, కొత్తపల్లి మండలం అధ్యక్షుడు నేరేడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



విల్లంబును పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

మహానంది: చెంచు, గిరిజన గూడేల్లో జీవనం సాగిస్తున్న వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు బీజేపీ ఈనెల 30న రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు. గురువారం ఆయన గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో పర్యటించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో జరిగే స్ఫూర్తి కార్యక్రమానికి గిరిజనులు, చెంచులు తరలిరావాలని ఆయన కోరారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన ఓ మహిళపై అదనపు కట్నం కోసం వేధింపులు జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలు బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాల ప్రకారం.. గూటుపల్లెకు చెందిన నన్నూర్ లత అనే మహిళను ఏడాదిన్నర క్రితం మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన శశికుమార్‌తో వివాహం చేశారు. అయితే ఇటీవల భర్త శశికుమార్‌తో పాటు అత్త రత్నమ్మ, మామ నాగయ్యలు అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నారని లత ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు